
సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



### ముగిసిన బ్రహ్మోత్సవాలు
అలంపూర్ ఆలయాల్లో చేపట్టిన మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

వివరాలు 8లో ▸



### ముగిసిన పోలీస్ ఈవెంట్స్
ఉమ్మడి జిల్లా కానిస్టేబుల్, ఎస్‌ఐ దేహదారుఢ్య పరీక్షలు మంగళవారంతో ముగిశాయి.

వివరాలు 10లో ▸

### వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.0 /18.0
ఉదయం శీతల గాలులు వీస్తాయి. రోజంతా వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం చూపిస్తుంది.

## న్యూస్‌రీల్

### 8 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు
**కందనూలు:** జిల్లా కేంద్రంలోని న్యూటీచర్స్ కాలనీలో కొలువైన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వచ్చే నెల 8 నుంచి 11వ తేదీ వరకు శ్రీవారి షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆకుతోట బంగారయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రధానమైన ఘట్టాలు, 9న కలశ స్థాపన, 10న శ్రీవారి కల్యాణోత్సవం, మహాన్యాస పూర్వక, వేదోక్త మహాలక్ష్మి దేవి అమ్మవారికి మహా కుంకుమాభిషేకం, ధన, కనక, వస్తు, వాహన, సంతాన, సౌభాగ్యాలను సకల జనులు పొందేందుకు ఈ మహత్తర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

### రామలింగేశ్వరస్వామి దేవాలయంలో..



**వెల్దండ:** మండల పరిధిలోని గుండాలలో శ్రీ అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహాపూర్ణాహుతి, అష్టదిగ్బలి, అన్న బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు వసంతోత్సవం, పుష్పోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దక్షిణకాశీగా ప్రసిద్ధికెక్కిన కోనేరులో నిమజ్జనం చేశారు. ప్రతిఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్యశర్మ, సురేష్ శర్మ, నరహరిశర్మ, వీరేశంశర్మ, సంతోష్‌శర్మ తదితరులు ఉన్నారు.

### డ్రోన్ పిచికారీపై అవగాహన అవసరం



**బిజినేపల్లి:** రైతులు సాంప్రదాయ పద్ధతిలో చేస్తున్న పిచికారీలను వదలి అధునాతన పద్ధతిలో డ్రోన్‌ల ద్వారా చేసే పిచికారీపై అవగాహన తప్పనిసరిగా పెంచుకోవాలని నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త డా.ఎం. సుజాత సూచించారు. మంగళవారం మండలంలోని వట్టెంలో డ్రోన్ పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. నూనె గింజల పంటలైన వేరుశనగ, కుసుమ, పొద్దు తిరుగుడు, నువ్వులు వంటి వివిధ రకాల పంటల్లో డ్రోన్‌లతో పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డ్రోన్ వాలిడేషన్ బృందం డా.దివ్యారాణి, మాధురి, శంకర్, సర్పంచ్ అమృతరెడ్డి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, ఏఈఓ విష్ణువర్ధన్ రైతులు పాల్గొన్నారు.

# ముందుకు సాగట్లే..



గోపల్‌దిన్నె రిజర్వాయర్ సమీపంలో తవ్విన కాలువ

## సింగోటం- గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనుల్లో తీవ్ర జాప్యం

- రూ.147.7 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఏడాదిన్నర కిందట టెండర్లు
- భూసేకరణ సమస్యలతో పాటు, కాంట్రాక్టు కంపెనీ నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తి
- సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

**కొల్లాపూర్:** నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 34 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలనే సంకల్పంతో చేపట్టిన సింగోటం- గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనులు ముందుకు సాగట్లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది. భూసేకరణలో ఆలస్యంతో పాటు పలు కారణాలతో పనులు చేపట్టడంలో కాంట్రాక్టు కంపెనీ అలసత్వం ప్రదర్శిస్తోంది. ప్రభుత్వం చొరవ చూపితే కానీ పనుల్లో ప్రగతి కనిపించేలా లేదు.

**చివరి ఆయకట్టు రైతుల కోసం..**

కొల్లాపూర్ నియోజకవర్గంలో జూరాల ఎడుమ కాల్వ కింది చివరి ఆయకట్టు భూముల రైతులకు యాసంగిలో సాగునీటి కోసం అవస్థలు నిత్యకృత్యంగా మారాయి. వాణిజ్య పంటలు పండే భూములు ఉన్నప్పటికీ నీటి వసతులు లేక చివరి ఆయకట్టు రైతులు ప్రతి సంవత్సరం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూరాలతో పాటు భీమా, కేఎల్‌ఐ ప్రాజెక్టు కింద కూడా పలు గ్రామాలకు కూడా యాసంగి సీజన్‌లో సాగునీరు అందక అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా సింగోటం-గోపల్‌దిన్నె లింక్ కెనాల్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేఎల్‌ఐ ప్రాజెక్టులో భాగమైన సింగోటం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వీపనగండ్ల మండలంలో జూరాల లెఫ్ట్ కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు కేఎల్‌ఐ నీటిని మళ్లించేలా ఈ కెనాల్‌కు రూపకల్పన చేశారు.

**టెండర్లు పూర్తి...**

సింగోటం- గోపల్‌దిన్నె లింక్ కెనాల్ నిర్మాణం డిమాండ్ చాలా కాలంగా ఉంది. అయితే రెండేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం లింక్ కెనాల్ పనులకు శ్రీకారం చుట్టింది. 25 కిలోమీటర్ల మేరకు కాల్వను తవ్వేందుకు రూ.147.7 కోట్ల నిధులను మంజూరు చేసింది. డీపీఆర్ రూపొందించాక, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. టెండర్ కాంట్రాక్టును రాఘవ, డీఎస్ఆర్ కంపెనీలు సంయుక్తంగా దక్కించుకున్నాయి. ఏడాదిన్నర కిందట టెండర్ పూర్తయింది. మొదట్లో పనులు వేగవంతంగా సాగాయి. కాల్వల తవ్వకాల కోసం దాదాపుగా 300 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. భూసేకరణలో ఇబ్బందులు తలెత్తడంతో పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి జోక్యం చేసుకుని రైతులతో విడతల వారీగా మాట్లాడి భూములు ఇప్పించేందుకు ఒప్పించారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ చేపట్టాల్సి ఉంది.

### పలు కారణాలు..
భూసేకరణతో పాటు వేర్వేరు కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టు కంపెనీ యాజమాన్యం రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. రాజకీయ పరమైన కారణాలతో పనులు చేస్తే బిల్లులు వస్తాయా లేక పెండింగ్‌లో ఉంచుతారా అనే మీమాంసలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పలు పర్యాయాలు కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడినా ఫలితం కనిపించడం లేదు. వారు పనులు చేపట్టేందుకు నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, అధికార యంత్రాంగం చొరవ చూపకుంటే నిర్ణీత సమయంలో పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

### ఐదు మండలాలకు ఉపయోగం..
**కొత్తగా నిర్మించబోయే లింక్ కెనాల్‌తో కొల్లాపూర్ నియోజకవర్గంలో ఐదు మండలాల రైతాంగానికి మేలు జరగనుంది. వీపనగండ్ల, చిన్నంబావి, కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లోని** పలు గ్రామాల్లోని చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందుతుంది. పాన్‌గల్ మండలంలో కొంత మేరకు సాగునీరు అందుతుంది. లింక్ కెనాల్‌కు తూములు ఏర్పాటు చేసి సమీపంలోని చెరువులు, కుంటలకు నీళ్లు మళ్లించేలా డిజైన్లు రూపొందించారు. లింక్ కెనాల్ ద్వారా నీటి సరఫరా ప్రారంభమైతే జూరాల లెఫ్ట్ కెనాల్ కింద ఉన్న 24,500 ఎకరాల ఆయకట్టు భూములకు, రాజీవ్ భీమా కాలువల కింద ఉన్న 9,500 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు లభిస్తుంది. అదేవిధంగా వేసవిలో గోపల్‌దిన్నె రిజర్వాయర్ కింద ఉండే పలు గ్రామాలకు తాగునీటి సమస్యలు కూడా తీరుతాయి.

### భూసేకరణలో ఇబ్బందులతో...



లింక్ కెనాల్ తవ్వకాల కోసం దాదాపుగా 300 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. భూసేకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని చాలామంది రైతులతో మాట్లాడి భూములు ఇప్పించారు. ఇంకా కొంత భూమి సేకరించాల్సి ఉంది. భూసేకరణ పూర్తయితే పనులు ఆరు నెలల్లో పూర్తి చేయవచ్చు. రైతులు సహకరిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఇప్పటి వరకు 5 కిలోమీటర్ల మేరకు కాల్వ తవ్వకం పూర్తయింది. చాలా చోట్ల అక్విడెక్టు పనులు కూడా పూర్తి చేశారు.
– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటి పారుదల శాఖ

### పనుల పూర్తికి కృషి చేస్తా..



సింగోటం- గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పూర్తయితే 35 వేల ఎకరాల మేరకు ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. ఈ కెనాల్ నిర్మాణం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నాం. భూ సేకరణలో ఇబ్బందులు ఎదురైతే రైతులతో మాట్లాడి ఒప్పించా. పనులు చేపట్టడంలో కాంట్రాక్టు కంపెనీకి రాజకీయపరమైన ఇబ్బందులు ఉన్నాయనే విషయం నాకు తెలియదు. నిర్మాణ పనుల విషయమై చాలా సార్లు కాంట్రాక్టు కంపెనీతో మాట్లాడాను. వారు త్వరగా చేస్తామని చెబుతున్నా.. పనులు కొనసాగడం లేదు. ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తా. త్వరితగతిన పనులు పూర్తి చేయించేందుకు నావంతు కృషి చేస్తా. – హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

## ‘కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి’
జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్ బాబు



కంటి పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్ బాబు

**కందనూలు:** కంటి వెలుగు శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రాజేష్ బాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాల్లో అందరూ కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కంటి వెలుగు శిబిరాల్లో సబ్ జైల్‌లోని 17 మంది ఖైదీలతో పాటు, ముగ్గురు న్యాయమూర్తులు, న్యాయవాదులు సిబ్బంది అందరూ పరీక్షించుకున్నారు. అనంతరం జిల్లా జడ్జి జైల్‌ను సందర్శించి ఖైదీల కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఖైదీలకు కావాల్సిసిన అన్ని వసతులు అందుబాటులో ఉంచాలని, జైలు అధికారులకు సూచించారు. ఖైదీలు తమకు కావాల్సిన న్యాయాన్ని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్‌ను సంప్రదించి పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి సబిత, ప్రిన్సిపాల్ జూనియర్ జడ్జి స్వరూప, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధాకర్ లాల్, జైలర్ బి. నాగరాజ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రధాన న్యాయవాది మధుసూదన్ రావు, జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి రమేష్ రెడ్డి, న్యాయవాదులు రాంబాబు, శ్రీరామ్ ఆర్యన్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నారాయణస్వామి, సురేష్, ఆప్టొమిక్ హేమలత పాల్గొన్నారు.

## ‘దళితబంధు’ వ్యాపారాలు నమోదు చేయాలి



ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

**నాగర్‌కర్నూల్:** దళితబంధు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక చేయూతతో లబ్ధిదారులు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు చేస్తున్న వ్యాపారాల వివరాలను దళితబంధు మొబైల్ యాప్‌లో వారి ఫొటోలు, వివరాలను నాలుగు రోజుల్లో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఉదయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో దళితబంధు లబ్ధిదారుల వ్యాపార వివరాలు దళితబంధు ప్రత్యేక మొబైల్ యాప్‌లో ఫొటో అప్‌లోడ్‌పై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఎంపిక చేసిన చారకొండ మండలంలోని 1,708 యూనిట్లకు రూ.170 కోట్ల నిధులతో గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తిచేసినట్లు వెల్లడించారు. దళితబంధు పథకం ద్వారా వివిధ రకాల వ్యాపారాలు, వివిధ రకాల వాహనాల ద్వారా ప్రతినెలా ఎంత ఆదాయం వస్తుంది, జీవన స్థితిగతుల్లో ఏమైనా మార్పు వచ్చిందా వంటి ఆదాయ వివరాలను సేకరించి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇలా నమోదు చేయడం ద్వారా లబ్ధిదారులు, దళిత రక్షణ నిధి ద్వారా మరింత లబ్ధి ఉండటంతో పాటు ఏ రకమైన వ్యాపారంలో అధికంగా లాభపడుతున్నారో అనే విషయాలతో భవిష్యత్‌లో ఎంపిక చేసే దళితబంధు లబ్ధిదారులకు సహాయ పడుతుందన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామ్‌లాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మి, నటరాజ్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి**

**మన్ననూర్:** ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని రాయలగండిలో ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించే శ్రీ లక్ష్మీచెన్నకేశస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ సందర్భంగా అవసరమైన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రముఖులను కలిసి ప్రత్యేక ఆహ్వానాలు తెలియజేశారు. మంగళవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్‌లకు పూల బొకేలను అందజేసి ఉత్సవాలకు హాజరుకావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు, గౌరవ అధ్యక్షుడు పాల్గొన్నారు.

## ప్రతిభను గుర్తించేందుకు సైన్స్ టాలెంట్ టెస్ట్
డీఈఓ గోవిందరాజులు



సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

**కందనూలు:** విద్యార్థుల్లోని సైన్స్ ప్రతిభను గుర్తించేందుకే జిల్లా వ్యాప్తంగా సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు డీఈఓ గోవిందరాజులు తెలియజేశారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. మంగళవారం బిజినేపల్లి బాలుర ఉన్నత పాఠశాలతో పాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో డీఈఓ గోవిందరాజులు హాజరై సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ప్రారంభించి, విద్యార్థులకు అందజేసి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో ప్రాథమికోన్నత మరియు ఉన్నత ప్రతి పాఠశాల నుంచి ఆరో తరగతి నుంచి 10వ తరగతుల వరకు ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి 2,020 మంది విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించామని చెప్పారు. ఇందులో పాల్గొన్న విద్యార్థుల నుంచి తరగతికి ఇద్దరు చొప్పున 20 మండలాల నుంచి 200 మంది విద్యార్థులు ఈ నెల 27న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించబోయే జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని చెప్పారు. అదేరోజు టాలెంట్ టెస్ట్ నిర్వహణ అనంతరం అగస్త్య ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్ అనే శాస్త్రవేత్త, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరిస్తామన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల క్రియేటివిటీ బయట పడుతుందన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలపై నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, మండల విద్యాధికారి భాస్కర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు నాయక్, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గోడు వినేందుకే పల్లెలకు..
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి



సమావేశంలో మాట్లాడుతున్న దిలీపాచారి

**సాక్షి, నాగర్‌కర్నూల్:** గ్రామీణ ప్రాంతాల సమస్యలు పాలకులకు పట్టడం లేదని, వారి గోడు వినేందుకే ‘పల్లె గోస, బీజేపీ భరోసా’ కార్యక్రమాన్ని చేపట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బిజినేపల్లి మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ నందివడ్డేమాన్‌తో పాటు గంగారం వంటి గ్రామాలకు నేటికీ కనీసం బస్సు సౌకర్యం లేదని చెప్పారు. గ్రామాల్లో రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమై ప్రయాణం నరకప్రాయంగా మారిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే దత్తత తీసుకున్న గ్రామాల్లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా అడుగుపెట్టలేదని విమర్శించారు. తాను దత్తత తీసుకున్న తిమ్మాజిపేట మండలం గొరిట గ్రామం వైపు ఎమ్మెల్యే కనీసం తొంగిచూడలేదని చెప్పారు. యుగంధర్, భాస్కర్‌రెడ్డి, రాము, బుచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌ను నమ్మొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్

**పెంట్లవెల్లి:** మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు ప్రజాఘోస కార్నర్ మీటింగ్‌లో పెంట్లవెల్లిలోని పాత గ్రామపంచాయతీ వద్ద సమావేశం నిర్వహించారు. అందుకు ముఖ్య అతిథులుగా జాతీయ బీజేపీ కార్యవర్గ సభ్యుడు వివేక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు హాజరై మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి ఏ నాయకుడు వచ్చినా నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడంలేదని అన్నారు.

**నాయకుల మధ్య తోపులాట..**

కార్నర్ మీటింగ్ సమావేశంలో మాజీ ఎంపీ వివేక్ మాట్లాడుతుండగా.. పెంట్లవెల్లి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, బీజేపీ డాండాం అంటూ ఏబీసీడీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలంటూ మాటిచ్చి కేంద్రంలో బిల్ పాస్ చేయకపోవడం సరికాదని ఎమ్మార్పీఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకుల మధ్య తోపులాట జరగడంతో స్థానిక పోలీసులు వచ్చి ఇరువురికి సర్ది చెప్పి పంపించారు.

## బకాయిలు చెల్లించాలి
**కోడేరు:** సహకార సంఘాల్లో వివిధ పథకాల్లో రుణాలు పొందిన లబ్ధిదారులు బకాయిలు కట్టకుండా ఉన్న వారు మార్చి 31 వరకు చెల్లించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సహకార సంఘం ఏజీఎం అజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు కట్టకుండా మొండి బకాయిలు ఉన్న వారికి ఓటీఎస్ కింద మార్చి 31 వరకు డబ్బులు చెల్లించాలన్నారు. ఇలా చెల్లించడంతో కొత్త వారికి రుణాలు ఇచ్చేందుకు తోడ్పడుతుందన్నారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న గోదాం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండేలా చూడాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రతిఒక్కరూ సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం సింగిల్ విండో కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ చిన్నారెడ్డి, డీజీఎం లింబాద్రి, కొల్లాపూర్ సహకార బ్యాంకు మేనేజర్ యాదగిరి, ప్రకాష్‌రెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాలే లక్ష్యంగా..

- ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు రూ.29 లక్షలతో అల్పాహారం
- పాఠశాలల వారీగా ప్రత్యేకంగా స్టడీ అవర్స్, సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ
- నేటి నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు

**కందనూలు:** విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకం. ఉన్నత విద్యకు ఇదే పునాది. అలాంటి పదో తరగతి పరీక్షలకు మరో 38 రోజుల సమయం మాత్రమే ఉంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సంబంధించి ఈ ఏడాది 11,078 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. ఒక ప్రభుత్వ పాఠశాలలోనే 5700పైగా విద్యార్థులు ఉన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ నవంబర్ 10 నుంచి పాఠశాలల వారీగా ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే 100% సిలబస్ పూర్తి చేసి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తుంది.

**అల్పాహారం పంపిణీ..**

జిల్లాలోని 131 పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున మొత్తం రూ.29,09,550 వ్యయంతో 34 రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి అర్ధాకలితో వచ్చే పదో తరగతి విద్యార్థులకు రోజూ రెండు పూటలా అల్పాహారాన్ని అందిస్తున్నారు.

- పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సబ్జెక్టులో మెరుగు పరిచేందుకు ఈ నెల 22 నుంచి మొదటి విడత ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు విద్యా శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. వచ్చే నెల 14 నుంచి రెండో విడత ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా పదో తరగతి మెయిన్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 11 వరకు కొనసాగనున్నాయి.

### ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం..



2021–22 విద్యాసంవత్సరం 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో 95.13% ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో జిల్లా 16వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మెరుగైన ఫలితాల సాధనం కోసం అంతకు మించి అన్నట్లు కృషి చేస్తున్నాం. ఇందు కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశాం. సమయాన్ని వృథా చేయకుండా, ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి. – గోవిందరాజులు, జిల్లా విద్యాశాఖ అధికారి

### 10 జీపీఏ సాధిస్తా..



పాఠశాల ఉపాధ్యాయుల మార్గదర్శకంలో రానున్న పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించాలని పట్టుదలతో ప్రతిరోజూ ప్రణాళికతో చదువుతున్నా. సబ్జెక్టుల వారీగా మాకు వచ్చే సందేహాలను సబ్జెక్టుల ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం.
– స్రవంతి, 10వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల, నాగర్‌కర్నూల్.

### విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..



పదో తరగతిలో అధిక శాతం విద్యార్థినులు 100శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ఎక్కువ సంఖ్యలో 10 జీపీఏ సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఈ ఏడాది తమ పాఠశాల నుంచి తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో 80 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కానున్నారు. చదువులో ముందున్న విద్యార్థినులతో పాటు వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, విద్యాబోధన సాగిస్తున్నాం. – లతా, ప్రధానోపాధ్యాయురాలు, బాలికల ఉన్నత పాఠశాల, నాగర్‌కర్నూల్

## క్లుప్తంగా

### బస్సు ఢీ.. మహిళ మృతి



మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా అప్పటికే మృతి చెందింది. మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లికి చెందిన వెన్న అలివేలమ్మ(35) పాలమూరు యూనివర్సిటీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తోంది. విధుల్లో భాగంగా మంగళవారం ఉదయం 8.30గంటల ప్రాంతంలో బండమీదిపల్లి నుంచి పాలమూరు యూనివర్సిటీకి నడుచుకుంటూ వెళ్తుంటే మార్గమధ్యలో పశుసంవర్ధక డిప్లొమా సమీపంలో రోడ్డుపై వెళ్తుంటే మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట వెళ్తున్న టీఎస్06యూసీ0638 ఆర్టీసీ బస్సు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అలివేలమ్మకు తల వెనుక భాగంతో పాటు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం మొదట జిల్లా జనరల్‌ఆస్పత్రికి తరలించగా.. వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. మృతురాలి కొడుకు వెన్న వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ అబ్దుల్ సమిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అచ్చంపేట రూరల్: పట్టణంలో ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైందని అచ్చంపేట ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలో భిక్షమెత్తుకునే వృద్ధుడు(65) రోడ్డు సమీపంలో మృతి చెంది ఉండటంతో స్థానికులు సమాచారం ఇచ్చారని తెలిపారు. అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు చెప్పారు. వృద్ధుడి వివరాలు తెలిస్తే అచ్చంపేట సీఐ ఫోన్ నంబర్ 8712657731, ఎస్‌ఐ 8712657732లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

### గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మొగులయ్య (ఫైల్)

గండేడ్: చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వెన్నచేడ్‌కు చెందిన పుల్లగారి చెన్న మొగులయ్య(35) తరచుగా చేపల వేటకు వెళ్లేవాడు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువులో చేపల వేటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ అక్కడికి చేరుకుని పరిశీలించగా చెరువు కట్టపై చెప్పులు, దుస్తులు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెరువులో గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో మృతదేహం నీటిపై తేలడంతో పోలీసులు వచ్చి వెలికితీశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై మొగులయ్య భార్య అమృతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ జనార్దన్‌గౌడ్ తెలిపారు.

# ముగిసిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు



తీర్థావళి కోసం ఊరేగింపుగా వెళ్తూ...

- వసంతోత్సవం పేరిట సంబురాలు
- పూర్ణాహుతితో పరిసమాప్తి
- నాగకన్యకల బావి వద్ద తీర్థావళి అమృత స్నానం
- ధ్వజఅవరోహణతో కార్యక్రమాలు ముగింపు

జోగుళాంబ శక్తిపీఠం: అయిదు రోజులుగా కొనసాగుతున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు వసంతోత్సవం పేరిట ఆలయ చైర్మన్, ఈఓ, అర్చకులు, ఉద్యోగులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి దేవతా మూర్తుల విగ్రహాలను పురవీధుల వెంట ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకుని నృత్యాలు చేశారు. అంతకు ముందు ఆలయం చుట్టూ అష్టదిక్పాలకులకు బలిహరణలు సమర్పించారు.

**చివరి రోజు..**

అయిదు రోజులుగా కొనసాగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజులో భాగంగా ఆవాహిత దేవతా హోమాలకు ఆలయ అర్చకులు వేదపండితులు వేదమంత్రాల మధ్య పూర్ణాహుతికి షోడశోపచార పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, దేవస్థానం చైర్మన్ బెక్కం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పూర్ణాహుతి సమర్పించి కొనసాగుతున్న యాగాలకు పరిసమాప్తి పలికారు. యాగరక్షను జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరుడికి సమర్పించి అనంతరం భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు.

**ఊరేగింపు..**

ఆలయ చైర్మన్, ఈఓ, ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు, పుర ప్రముఖులు, మహిళలు అందరు కలిసి అర్చక స్వాముల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య నాగకన్యకల బావి వద్దకు శిరస్సున కలశాలు ధరించి ఊరేగింపుగా



ధ్వజా అవరోహణం చేస్తున్న ఆలయ సిబ్బంది

చేరుకున్నారు. అక్కడ దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్మార్థ పండితులు నూనెపల్లి కృష్ణమూర్తి శర్మ తీర్థ, మృత్తిక స్నానం గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. దీంతో చైర్మన్, ఈఓ, అర్చకులు, పాలకమండలి సభ్యులు అంతా కలిసి దేవతామూర్తుల విగ్రహాలతో నాగకన్యకల బావిలోకి దిగి అవబృంద స్నానం చేయించారు. అంతకు ముందు బావి తీరాన సహస్త్రదారలతో పంచామృతాభిషేకాలు, గంధం, కుంకుమ, బస్మ జలాలతో చేసిన తీర్థవళి కార్యక్రమం అక్కడి భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం బావి తీరాన భక్తులంతా కలిసి పుణ్యస్నానాలు ఆచరించారు.

**ధ్వజ అవరోహణతో..**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా చివరిగట్టమైన ధ్వజఅవరోహణతో కార్యక్రమాలు ముగిశాయి. ఈ సందర్భంగా ధ్వజస్తంభం పైన రెపరెపలాడుతున్న నందిపథాకాన్ని కిందికి దించి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ముగించారు. అదే విధంగా ఉత్సవవరులను గర్భాలయంలోకి చేర్చి అక్కడ మహా నివేదనలు, దశవిదహారతులు సమర్పించి మంత్రపుష్పాలను పఠించారు. యాగశాలలో ఆలయ పాలకమండలి, అధికారులు, భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

**అన్నసంతర్పణ**

ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో సహపంక్తి పేరిట ఆలయ అధికారులు ఊరి ప్రజలను, అధికారులను, అనధికారులు, రాజకీయ నాయకులను, భక్తులను అందరిని ఆలయానికి పిలిచి అన్నసంతర్పణ పేరిట అందరికి పిండి వంటకాలతో భోజనాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మునుపెన్నడూ లేని విధంగా ఎంతో వైభవంగా ముగిశాయని, ఇందుకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.



కలశ ఉద్వాసనకు ఇస్తున్న హారతులు

# మా కొడుకు నుంచి కాపాడండి

- డీఎస్పీకి ఫిర్యాదు చేసిన దంపతులు



మాట్లాడుతున్న భీరయ్య, తిర్మలమ్మ దంపతులు

జడ్చర్ల టౌన్: చంపుతానని బెదిరిస్తున్న తమ కుమారుడి నుంచి కాపాడాలని కోరుతూ కన్న తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఆ వివరాలను మంగళవారం జడ్చర్లలో విలేకరులకు తెలిపారు. మండలంలోని పెద్దఆదిరాల గ్రామానికి చెందిన ఇమ్మడి భీరయ్య, తిర్మలమ్మ దంపతులకు వెంకటేశ్, మల్లేష్ కుమారులు. వారికి పెళ్లి చేసి, ఒక్కొక్కరి పేరున నాలుగున్నర ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం భీరయ్య, తిర్మలమ్మ దంపతుల పేరున 9ఎకరాల భూమి ఉంది. గ్రామంలో ఇల్లు ఉండగా, కుమారులు ఇద్దరికీ ఇంటిస్థలాలు ఇప్పించారు. అందులో చిన్న కుమారుడు ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. తల్లిదండ్రుల పేరున ఉన్న భూమిని సైతం తమ పేరు చేయాలని చిన్నకుమారుడు కొంతకాలంగా ఒత్తిడి తెస్తున్నాడని, వారంక్రితం తమను ఇంటినుంచి గెంటి వేసి తాళం వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ పొలంలో కష్టపడి మిరపపంట వేసుకోగా, దానిని వారం క్రితం ట్రాక్టర్‌తో దున్నించి వేశాడని, తన కుమారుడు మల్లేష్‌కు గాజుల నర్సింహ, ఆర్.నర్సింహులు, వీరస్వామి, ఇమ్మిడి మల్లయ్య సహకరించారని తెలిపారు. ఇదేమిటని కొడుకుని ప్రశ్నిస్తే ఇంటి నుంచి గెంటేశారని, దీంతో తాము ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయంలో మూడురోజులు, గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో రెండు రోజులు గడిపామని వాపోయారు. సోమవారం నుంచి జడ్చర్లలోని న్యాయవాది టి.శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో ఆశ్రయం పొందామని తెలిపారు. 80ఏళ్ల వయసులో తాను కష్టాలు పడలేనని, తన చిన్నకుమారుడు మల్లేష్ నుంచి ప్రాణహాని ఉన్నందున న్యాయం చేయాలని, తనవద్దకు, పొలం వద్దకు రాకుండా చూడాలని కోరారు. అలాగే మిరపతోట దున్నిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీన్ని పరిశీలించిన మహబూబ్‌నగర్ డీఎస్పీ, జడ్చర్ల సీఐ రమేష్‌బాబుకు రెఫర్ చేశారు. ఈ విషయమై మల్లేష్ మాట్లాడుతూ తనకు గతంలో పెద్ద మనుషుల ముందర దున్నుకోమని చెప్పిన పొలాన్ని మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్నానని, ఇంట్లో నుంచి గెంటివేయలేదని తెలిపారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

- పోలీసుల వేధింపులే కారణమని ఆరోపణ



చికిత్స పొందుతున్న హన్మయ్య

గండేడ్: పురుగు మందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని వెన్నచేడ్‌కు చెందిన తంగి హన్మయ్య(65) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇతని చిన్న కుమారుడు ఆంజనేయులు గ్రామానికి చెందిన ఓ వివాహితను తీసుకెళ్లాడని సదరు వివాహిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతని ఆచూకీ చెప్పాలని తండ్రి హన్మయ్యతోపాటు పెద్ద కుమారుడిని పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. రెండు రోజుల్లో చెప్పకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని పోలీసులు బెదిరించారని, దీంతో భయాందోళనకు గురైన హన్మయ్య మంగళవారం తెల్లవారుజామున పురుగు మందు తాగాడు. ఇంటికి సమీపంలోని దర్గా దగ్గర పురుగుల మందు తాగి ఉండడం గమనించిన స్థానికులు 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ సైదయ్యను వివరణ కోరగా తాము ఎవరినీ బెదిరించలేదని, బాధితుల ఫిర్యాదు మేరకు పిలిపించి మాట్లాడామని చెప్పారు.

**పోలీస్ ఉద్యోగం రాదని యువకుడు..**

మరికల్: పోలీస్ ఉద్యోగం రాదని ఓ యువకుడు మనస్తాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఘటన మంగళవారం మాధవరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మరికల్ మండలం మాధవరానికి చెందిన మహేష్‌కు పోలీస్ ఉద్యోగం చేయాలని గతంలో దరఖాస్తు చేసుకున్నాడు. అప్పట్లో ఎత్తు తక్కువగా ఉండటంతో ఎంపిక కాకపోవడంతో ఉద్యోగానికి అర్హత కోల్పోయాడు. ఈ క్రమంలో శివమాల వేసి శ్రీశైలం వెళ్లి వచ్చిన రెండు రోజులకే గ్రామ శివారులోని దత్తాత్రేయ ఆలయం వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. చుట్టూ పక్కల వారు గమనించి మంటలను ఆర్పేవరకు 80 శాతం శరీరం కాలిపోయింది. చికిత్స నిమిత్తం వెంటనే అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి భార్య, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలియజేశారు.

# ఉద్యానపంటలపై రైతులకు శిక్షణ



ఉద్యాన నర్సరీ కిట్లను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉద్యాన పంట నర్సరీల యాజమాన్యంపై రైతులకు మంగళవారం శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల సాగులో భాగంగా పండ్ల తోటల ఎంపిక, అంటు కట్టడం, మొక్కల పెంపకం, అందులో చీడపీడల నివారణ చర్యలపై రైతులకు పాలెం కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల నర్సరీల కిట్‌లను రైతులకు అందజేశారు. ఈ కిట్లను రైతులు ఏవిధంగా వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో పాలెం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.పుష్పావతి, శాస్త్రవేత్తలు చరణ్‌తేజ, రజిని, రైతులు పాల్గొన్నారు.

# విగ్రహాల దొంగకు రిమాండ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

పెబ్బేరు: మండల పరిధిలోని రాంపూర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను చోరీ చేసిన దొంగలను పట్టుకుని మంగళవారం రిమాండ్‌కు పంపామని ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు. డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించి, నేరస్తుడిని గుర్తించామని, విచారణలో శ్రీరాములు, హనుమంతుని ఉత్సవ విగ్రహాలను మద్యంమత్తులో చోరీ చేసినట్లు అదే గ్రామానికి చెందిన బుడగజంగాల శివకుమార్ ఒప్పుకున్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

## పట్టపగలు చోరీ

నవాబుపేట: మండలంలోని చాకలపల్లిలో పట్టపగలు చోరీ జరిగిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వీర్లపల్లి చంద్రయ్య, అతడి భార్య కలిసి కూలీ పనుల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లారు. పిల్లలు ఇద్దరు ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం పాఠశాల నుంచి పిల్లలు తిరిగి వచ్చి చూడగా, తాళం తీసి ఉండడంతో పాటు బీరువా తాళం పగులగొట్టి బట్టలు చిందర వందరగా పడిఉన్నాయి. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో చంద్రయ్య వెంటనే ఇంటికి వచ్చి చూశాడు. బిరువాలో ఉన్న రూ.లక్ష నగదు, అర తులం బంగారం కమ్మలు, 4 తులాల వెండి గొలుసులు చోరీ చేసినట్లు బాధితుడు వాపోయాడు. మంగళవారం చంద్రయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుశోత్తం తెలిపారు.

## గడ్డి వాము దగ్ధం



మిడ్జిల్: మండలంలోని మసిగొండ్లపల్లిలో మంగళవారం గ్రామానికి చెందిన రైతు లక్ష్మయ్య గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దాదాపు రెండు ట్రాక్టర్ల గడ్డి కాలిపోయింది. చుట్టు పక్కల వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు తెలిపారు.

# పేకాట స్థావరంపై దాడి

పాన్‌గల్: పేకాట స్థావరంపై దాడి చేసి 12మందిపై కేసు నమోదు చేసిన సంఘటన మంగళవారం మండలంలోని కేతేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా 12 మంది వ్యక్తులు, మూడు సెల్ ఫోన్‌లు, ఐదు బైక్‌లు లభించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పట్టుబడిన 12 మందిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

**పేకాటరాయుళ్ల అరెస్ట్**

ఊట్కూరు: స్థానిక శ్రీరాంనగర్ వీధి ఆంజనేయ స్వామి ఆలయం వెనక భాగంలో చెట్లలో మంగళవారం పేకాట ఆడుతుండగా 10 మందిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. రూ.4,850లు, 4 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అన్వర్, శంకరప్ప, మౌలాలీ, సతీష్, నర్సింహా, గోవింద్, ఊశప్ప, శంకర్, తిప్పన్న, రాములు తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భర్త హత్య కేసులో భార్యకు యావజ్జీవ శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: భర్తను హత్య చేసిన కేసులో నింధితురాలు భార్యకు యావజ్జీవ జైలు శిక్షతో పాటు జరిమాన విధిస్తూ జిల్లా సెషన్‌కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే చిన్నచింతకుంట మండల పరిధిలోని ఫర్దీపూర్ గ్రామానికి చెందిన తిరుపతయ్య, సుజాత ఇద్దరూ భార్యభర్తలు. కాగా సుజాత మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఈ విషయంలో భార్యభర్తలు నిత్యం గొడవపడుతుంటే చాలాసార్లు పెద్దలు పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పారు. ఈ క్రమంలో సుజాత ప్రవర్తనలో మార్పురాకపోవడంతో పాటు తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డువస్తున్నాడని 2016 నవంబర్ 9న తెల్లవారుజామున నిద్రపోతున్న భర్త తిరుపతయ్యను కత్తితో గొంతు కోసి హత్య చేసింది. దీనిపై మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీకుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చార్జీషీట్ దాఖలు చేయగా.. మంగళవారం జిల్లా సెషన్ కోర్టుకు ఈ కేసు వచ్చింది. సుజాతను దోషిగా నిర్ధారిస్తూ, యావజ్జీవ జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసు దర్యాప్తునకు కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ కె.నరసింహ అభినందించారు.

# ఎరువుల వాడకంలో పొదుపు

**పాడి-పంట**

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పంట సాగులో రైతులు అత్యధికంగా రసాయనిక ఎరువుల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. ఎరువులు ఖరీదైనవి, విలువైనవిగా ఉంటాయి. దేశంలో తయారయ్యే ఎరువులు అవసరాలకు చాలక దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం ఎరువుల కర్మాగారాల కోసం రూ.కోట్లు సబ్సిడీ ఇస్తోంది. ఎరువులను పొదుపుగా వినియోగించుకుని పెట్టుబడిలో ఆదా చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ సూచించారు.

**ఎలా వాడుతున్నారు..**

నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలను ఆహార పంటలకు 4:2:1 నిష్పత్తిలో వాడాలి. రైతులు భాస్వరం, పొటాష్‌ను అవసరం కన్న తక్కువగాను, నత్రజనిని సిఫార్సు చేసిన దానికంటే రెండు నుంచి రెండన్నర రెట్లు అధికంగా వినియోగిస్తున్నారు. అవసరం లేని పోషకాన్ని వేసి వృథా చేయడంతో ఖర్చు పెరిగి, పోషకాల సమతుల్యత లోపించి, దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు.

**పొదుపు సాధ్యం ఎలా...**

అవసరమైన మేరకు ఎరువులను పంటకు అందించడం, వేసిన ఎరువులను సమర్థవంతంగా మొక్క తీసుకునేలా చేయడంతో ఎరువుల ఖర్చును తగ్గించుకునే అవకాశం ఉంటుంది. ఇది సాధించడానికి నాలుగు అంశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

1. ఎరువులు ఎంత వేయాలి. 2. ఏ విధంగా వేయాలి. 3. ఏవి ఎంపిక చేసుకోవాలి. 4. ఏ సమయంలో ఎన్ని సార్లు విభజించి వేయాలి. వీటిపై సరైన అవగాహన పెంచుకుంటే ఎరువులను పొదుపుగా వాడుకోవడానికి అవకాశం ఉన్నట్లని తెలియజేశారు.

**ఎరువులు వేసే పద్ధతి..**

ఎరువులు ఎంత మేరకు వేయాలన్నది ఎంత ముఖ్యమో వాటిని వేయాల్సిన పద్ధతి అంతే ముఖ్యం. సరైన పద్ధతిలో ఎరువులు వేసినప్పుడు మొక్కలు పోషకాలను బాగా వినియోగించుకుంటాయి.



మందులను పిచికారీ చేసే యంత్రాలు

**ఎరువులు వెదజల్లె పద్ధతి(బ్రాడ్ కాస్టింగ్)..**

విత్తడానికి ముందు, నాటడానికి ముందు పైపాటుగా లేదా ఎరువులు పొలంలో సమానంగా పడేలా చల్లడాన్ని వెదజల్లే పద్ధతిగా పేర్కొన్నారు. మొక్కలు పొలం నిండా దగ్గర దగ్గరగా ఉండి వరుసల్లో లేని పైర్లకు, వేళ్లు భూమిలో అల్లుకొని ఉండే పైర్లకు ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది. మాగాణి వరికి ఇది అనువైన పద్ధతి. పొలం చదునుగా లేకపోయినా పొలం మీద ఎరువులు సమానంగా పడేలా చల్లకపోయినా పైరులో హెచ్చు తగ్గులు ఏర్పడటం జరుగుతుంది. నీరు నిలిచి ఉన్న పొలంలో గాని పొడి నేల మీదగాని ఎరువులు చల్లితే వృథా అవుతాయి. ఏ ఎరువులు పొలానికి వేసినా నేలలో కలిసేలా వేయాలి. తగినంత తేమ ఉండాలి.

**మొక్కల మొదళ్ల వద్ద ఎరువులు..**

పొలం మీద ఎరువులు వేదజల్లడం కన్న వేళ్ల దగ్గర ఎరువులు వేయడం మేలైన పద్ధతి. తక్కువ ఎరువుతో ఎక్కువ పోషకం మొక్కకు అందేలా చేయవచ్చు. దూరం దూరంగా మొక్కలు ఉన్నప్పుడు వేళ్లు తక్కువ విస్తీర్ణంలో వ్యాపించి ఉన్నప్పుడు భూసారం తక్కువగా ఉన్న నేలలకు ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.

**గొర్రుతో వేయడం..**

మెరుగుపర్చబడిన ఈ నాటి గొర్రు(సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్) సాయంతో విత్తనం, ఎరువు కావాల్సినంత దూరంలో, కావాల్సిన లోతులో పడేలా వేయవచ్చు. విత్తనం వేసేదానికి 5 సెం.మీ లోతులో 5 సెం.మీ దూరంలోనూ ఎరువు పడితే మొలకెత్తగానే వేళ్లకు పోషకాలు అందుబాటులో ఉంటాయి. ఎరువు వేసే సమయాల్లో విత్తనానికి తగలకుండా జాగ్రత్త పడాలి. మెట్ట, ఆరుతడి పైర్లకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

**గుంటల్లో వేయడం..**

మొక్క మొదళ్ల వద్ద తేమగా ఉన్నప్పుడు 6 లేకా 7 సెం.మీల లోతులో చిన్న గుంత తీసి ఎరువు వేసి మట్టితో కప్పిపెట్టాలి. దీంతో వేళ్లకు దగ్గరగా పోషకాలు అందుబాటులో ఉండి శక్తివంతంగా ఉపయోపడుతాయి. వృథా అయ్యే శాతం తక్కువ. నీటి వసతితో సాగుచేసే పత్తి, మిరప, అరటి, పంటలకు ఇలా ఎరువులు వేయవచ్చు.

**వరుసల్లో వేయడం..**

మొక్కకు మొక్కకు దూరం తక్కువైనప్పుడు వరుసలో ఒక పక్కగాని రెండు పక్కలు గాని 4 నుంచి 5 సెం.మీ లోతైన నాగలి చాలు తీసిగాని, గొర్రుతో గాని, చేతితోగాని ఎరువు వేయాలి.

**పండ్ల తోటలకు వేసే పద్ధతి..**

చెట్టు వయస్సును బట్టి మొక్కతాలూకు వేర్లు తలకట్టు వరకు వ్యాపించి ఉంటాయి. అంత వరకు పాదు చేయాలి. సాధారణంగా నేలపై పొరల్లోని పీచు వేళ్ల సముదాయం పోషకాలను చురుకుగా తీసుకుంటుంది. మొక్క మొదలు నుంచి వయసును బట్టి 1 లేకా 11/2 దూరం వదిలి వేయాలి. నేలలో తగినంత తేమ ఉన్న సమయాల్లో పాదంత ఎరువులు చల్లి పారతో పలుచగా తిరగవేయాలి. దీంతో ఎరువులు మట్టిలో కలిసిపోతాయి. ఆవిరి ద్వారాగాని, నీటి ద్వారా గాని పోషకాలు నష్టమయ్యే అవకాశం ఉండదు. ఇది మేలైన పద్ధతి. పెద్ద చెట్లకు నాలుగు వైపుల నాలుగు చిన్న గుంతలు (30 సెం.మీ వెడల్పు, 15 సెం.మీ లోతు)తీసి అందులో సమానంగా ఎరువు వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి. లేదా అదే లోతులో వలయాకారంలో గాడి తీసి ఎరువులు వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి. ఈ పద్ధతిలో ఎరువులు వేయడాన్ని రింగ్ ప్లేస్‌మెంట్ అంటారని వివరించారు.

**ఎలా ఎంపిక చేసుకోవాలి..**

యూరియా, అమ్మోనియం సల్ఫేట్, కాల్షియం అమ్మోనియం నైట్రేట్ ఎరువుల్లో ఉన్న ముఖ్యపోషకం. నత్రజని అయినప్పటికీ అది రసాయనికంగా వివిధ రూపాల్లో ఉంటుంది. ఎరువుల లక్షణాలు వేర్వేరుగా ఉంటాయి. ఇసుక ఎక్కువగా ఉన్న మాగాణి భూముల్లో తప్ప మిగిత అన్ని నేలలకు, పంటలకు పైరు అదుగులోనూ యూరియా వేసుకోవచ్చు. అమ్మోనియం సల్ఫేట్ క్షార గుణం నేలలకు, సున్నపు పాలు ఎక్కువగా ఉన్న నేలలకు ఎప్పుడైన వేసుకోవచ్చు. వరికి చిరుపొట్టు దశలో మాత్రం వేసుకోదగినది. పైరు అడుగులోనూ మొదటి సారి పైపాటు సమయాల్లో వేస్తే అందులోని నైత్రజని వృథా అవుతుంది.

- సూపర్ ఫాస్పేట్‌ను సాధారణంగా అన్ని పైర్లకు క్షార నేలలకు వేయవచ్చు. ఆమ్ల గుణం ఉన్న నేలలకు సల్ఫైడ్ ఇంజూరీ వచ్చే నేలలకు వేయవద్దు. ఆమ్ల గుణం నేలలకు డైకాల్షియం ఫాస్పేట్, రాక్ ఫాస్పేట్ వంటివి పనికి వస్తాయి. అయితే ఇవి క్షార గుణం ఉన్న నేలలకు, సాధారణ పైర్లకు ఉపయోగపడవు. ఫల వృక్షాలు, తోట వృక్షాల వంటి బహు వార్షికాలకు వాడవచ్చు. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పొలచౌడు నేలలకు తప్ప మిగిలిన అన్ని నేలలకు వాడవచ్చు. పొగాకు పైరుకు వేయరాదు. నాణ్యత తగ్గిపోతుంది. సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌ను అన్ని నేలలకు, అన్ని పైర్లకు వాడవచ్చు. కాంప్లెక్స్‌ల్లో ఎరువుల్లో అమ్మోనియం ఫాస్పేట్లు అన్ని నేలలకు అన్ని పైర్లకు వేయవచ్చు. నైట్రో ఫాస్పేట్లు మెట్ట, ఆరుతడి తోట పైర్లకు, ఎర్ర నేలలకు, సామాన్య రసాయన స్థితిగల నేలలకు, కొద్దిపాటి ఆమ్లగుణం ఉన్న నేలలకు బాగా ఉపయోగపడుతాయి.

## క్లుప్తంగా...

### 22న శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోటా విడుదల

**తిరుమల:** మార్చి, ఏప్రిల్, మే నెలకు సంబంధించి శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను ఈ నెల 22న సాయంత్రం 4 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. వీటిలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన మిగతా ఆర్జిత సేవా టికెట్లకు ఆన్‌లైన్ లక్కీడిప్ నమోదు ప్రక్రియ 22న ఉదయం 10 గంటల నుంచి 24న ఉదయం 10 గంటల వరకు ఉంటుంది. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన వారు సొమ్ము చెల్లించి సేవను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.



చెన్నారంలో చెరకు తోటలను పరిశీలిస్తున్న చరణ్‌జిత్‌సింగ్, అధికారులు

### మా దేశానికి రండి.. భూమి కౌలుకిస్తాం

చెరకు రైతుల సాగు విధానం భేష్..
ఫిజీ చక్కెర పరిశ్రమల శాఖ మంత్రి చరణ్‌జిత్ సింగ్

**నేలకొండపల్లి:** 'చెరుకు రైతుల సాగు విధానం బాగుంది.. ఆసక్తి ఉన్న రైతులు మా దేశానికి వస్తే భూమి కౌలుకు ఇప్పిస్తాం.. ఇక్కడితో పోలిస్తే మా దేశంలో ఆదాయం ఎక్కువ వస్తుంది..' అని ఫిజీ చక్కెర పరిశ్రమల శాఖ మంత్రి చరణ్‌జిత్ సింగ్ చెప్పారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీని చరణ్‌జిత్ సింగ్, ఫిజి దేశ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా చెరుకు సాగు, ధర, క్రషింగ్ వివరాలపై ఫ్యాక్టరీ ఎండీ నామా కృష్ణయ్యతో చర్చించారు. అనంతరం చెన్నారంలో చెరుకు పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చరణ్‌జిత్ సింగ్ మాట్లాడుతూ చెరుకు సాగు విధానం ఇక్కడ బాగుందని ప్రశంసించారు. రైతులు తమ దేశానికి వస్తే భూములు కౌలుకు ఇప్పిస్తామని ఆహ్వానించారు. అక్కడే ఓ రైతు ఆవులతో దుక్కిపాటు చేస్తుండగా... తమ దేశంలో గోవులను పూజిస్తామని, వ్యవసాయం చేయమని స్పష్టం చేశారు. మంత్రి వెంట ఫిజీ కార్యదర్శి ఈలా, ప్రభుత్వ సీఈవో విమల్‌దత్, మధుకాన్ సీజీఎం కోటయ్య తదితరులున్నారు.

# సంక్షేమ సర్కారు ఆదర్శ పాలన

## వీడ్కోలులో ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసలు



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

**సాక్షి, అమరావతి:** సమాజంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శప్రాయమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారని అభినందించారు. రాజకీయ నేతల అంతిమ లక్ష్యం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సమాజ శ్రేయస్సే కావాలని, ముఖ్యమంత్రి జగన్ దీన్ని ఆచరణలో చూపిస్తున్నారని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న విశ్వభూషణ్ హరిచందన్‌కు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విజయవాడలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ గవర్నర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. ''రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటం సంతోషదాయకం. సమాజంలో ఏ వర్గాన్ని విస్మరించకుండా సంక్షేమ పథకాలను అందిస్తుండటం నిజంగా అబ్బురం. వీటిపై మేం చాలాసార్లు చర్చించుకున్నాం. ఇన్ని సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు అన్ని నిధులు ఎలా సమకూరుస్తున్నారని ముఖ్యమంత్రి జగన్‌ను అడిగితే అంతా దేవుడి ఆశీర్వాదమని వినమ్రంగా బదులిచ్చారు'' అని గవర్నర్ చెప్పారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రజా ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించి రాజ్యాంగ విలువలకు పెద్దపీట వేశారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

# సీఐపై దాడి కేసులో 11 మంది టీడీపీ నేతల అరెస్ట్

- టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి ఆస్పత్రికి, 10 మంది జైలుకు..
- టీడీపీ వారిపై మూడు, ఎమ్మెల్యే అనుచరులపై ఒక కేసు నమోదు



దాడిలో గాయపడిన సీఐ కనకారావు

**గన్నవరం / నాగాయలంక (అవనిగడ్డ) / కోనేరు సెంటర్:** కృష్ణాజిల్లా గన్నవరంలో విధి నిర్వహణలో ఉన్న సీఐ పి.కనకారావును కులం పేరుతో దూషిస్తూ, రాళ్లతో కొట్టి గాయపరిచిన కేసులో టీడీపీ నేతలకు కోర్టు రిమాండ్ విధించింది. వీరిలో టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిని ప్రభుత్వాస్పత్రికి, పదిమందిని గన్నవరం సబ్‌జైలుకు తరలించారు. గన్నవరంలో సోమవారం టీడీపీ నేతలు సృష్టించిన ఘర్షణకు సంబంధించి పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. వీటిలో మూడు టీడీపీ నేతలు, కార్యకర్తలపై.. ఒకటి ఎమ్మెల్యే అనుచరులపై నమోదైంది. పట్టాభి తనను కులం పేరుతో దూషించడమేగాక ఆయనతోపాటు దొంతు చిన్నా, జాస్తి వెంకటేశ్వరరావు మరో ఎనిమిది మంది తనను రాళ్లతో కొట్టి తీవ్రంగా గాయపర్చడంతోపాటు చంపేవిధంగా అనుచరులను ప్రేరేపించారని సీఐ కనకారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభి తదితరులపై అట్రాసిటీ సహా పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే వంశీమోహన్ అనుచరులు యతేంద్రరామకృష్ణ, మోహన్‌రంగా తదితరులు తమ ఇంటికి వచ్చి బెదిరించినట్లు టీడీపీ నేత దొంతు చిన్నా భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. టీడీపీ నేతలు పట్టాభి, చిన్నా, వీరంకి గురుమూర్తి, లావు వంశీకృష్ణ, జాస్తి ఆదిశేషు, లావు వంశీకృష్ణ, చల్లగుళ్ల సందీప్, గురివిందగుంట దేవేందర్, ముప్పరాజు కార్తీక్, గుజ్జర్లపూడి బాబూరావు, కంచర్ల సూర్యప్రకాష్‌లను అరెస్ట్‌చేసి మంగళవారం స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. పట్టాభి తనను పోలీసులు కొట్టినట్లు ఆరోపించడంతో ఆయనకు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యచికిత్స చేసిన తర్వాత రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపరచాలని జడ్జి బి.శిరీష పోలీసులను ఆదేశించారు. మిగిలిన పదిమందికి రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు పట్టాభిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి, మిగిలినవారిని గన్నవరం సబ్‌జైలుకు తరలించారు.

**పోలీసులతో పట్టాభి భార్య వాగ్వాదం**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పట్టాభి ఇంటివద్ద మంగళవారం ఆయన భార్య చందన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించిన ఆమె నిరపరాధి అయిన తన భర్తను విడుదల చేయకపోతే డీజీపీ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించటంతో పోలీసులు అభ్యంతరం చెప్పారు. దీనిపై ఆమె పోలీసులతో పరుష పదజాలంతో వాగ్వాదానికి దిగారు.

**టీడీపీ నేతల దౌర్జన్యం**

గన్నవరం ఘటనకు సంబంధించి మచిలీపట్నం, నాగాయలంకల్లో సోమవారం అర్ధరాత్రి టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగి, పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. గన్నవరం నుంచి తొమ్మిదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు మచిలీపట్నంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి తరలించారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో గన్నవరం టీడీపీకి చెందిన ఒక న్యాయవాది తొమ్మిదిమంది అనుచరులతో అక్కడికి వెళ్లి భద్రత విధుల్లో ఉన్న సిబ్బందిపై దౌర్జన్యం చేసి పోలీసులు నిర్బంధించిన తొమ్మిదిమంది నాయకులు, కార్యకర్తలను కార్లలో తప్పించారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ జాషువ వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది జీపీఎస్ ద్వారా తప్పించుకున్న వారిని వెంబడించి నిమిషాల వ్యవధిలో న్యాయవాదితో సహా అందరినీ పట్టుకుని బందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ వాణి ఫిర్యాదు మేరకు మొత్తం 19 మందిపై కేసు నమోదు చేశారు. గన్నవరం ఘటనకు సంబంధించి పోలీసులు అదుపులోకి తీసుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సోమవారం అర్ధరాత్రి నాగాయలంక పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆయన అనుచరులు, స్థానిక టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేశారు. బోడెని చూసేందుకు అనుమతించాలంటూ సీఐ శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగారు. టీడీపీ మహిళా నేత తలశిల స్వర్ణలత, కొందు తెలుగు తమ్ముళ్లు సచివాలయ మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా మాట్లాడారు. బోడె ప్రసాద్‌ను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

**రెచ్చగొట్టి మరీ రచ్చ రచ్చ**

గన్నవరం ఘటనలో బరితెగించిన టీడీపీ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

# ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రంలో భారీ లోపం

- 800 మెగావాట్ల తొలి యూనిట్ సిద్ధమైనా ట్రయల్ రన్ వాయిదా
- నాసిరకం రీహీటర్ ట్యూబ్స్ లీకేజీయే కారణం
- 7,500 చోట్ల మరమ్మతులు అవసరం.. వాటి పూర్తికి మరో నెల సమయం
- మార్చి చివరిలో తొలి యూనిట్‌లో ఉత్పత్తికి అవకాశం
- జూలైలో రెండో యూనిట్‌లో ఉత్పత్తికి ప్రణాళికలు



**సాక్షి, హైదరాబాద్:** నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా రామగుండంలో 1600 (2x800) మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులో భారీ లోపం బయటపడింది. విద్యుత్ కేంద్రంలోని 800 మెగావాట్ల తొలి యూనిట్ నిర్మాణం పూర్తయినా బాయిలర్‌లోని రీహీటర్ ట్యూబ్స్ విఫలం కావడంతో గత డిసెంబర్‌లో జరగాల్సిన ట్రయల్ రన్ వాయిదా పడింది. మరమ్మతుల్లో భాగంగా ఈ గొట్టాలకు లోపాలున్న చోట కట్ చేసి వెల్డింగ్ చేస్తున్నారు. ఏకంగా 7,500 చోట్ల వెల్డింగ్ చేస్తున్నారని, ఇందుకు మరో నెల రోజుల సమయం పట్టనుందని అధికార వర్గాలు తెలిపాయి. ఆలోగా మరమ్మతులు పూర్తయితే మార్చిలో తొలి యూనిట్ ద్వారా ప్రయోగాత్మకంగా విద్యుదుత్పత్తి జరిపి ట్రయల్ రన్ నిర్వహించే అవకాశాలున్నాయి.

**రీహీటర్ ట్యూబులే కీలకం**

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో హై ప్రెషర్, ఇంటర్మీడియేటరీ ప్రెషర్, లో ప్రెషర్ టర్బైన్లు ఉంటాయి. బాయిలర్లలో వేడిచేసిన నీళ్లు ఆవిరిగా మారి 600 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రత, భారీ పీడనంతో గొట్టాల ద్వారా 'హైప్రెషర్ టర్బైన్'లోకి ప్రవేశించి దాన్ని తిప్పుతూ మళ్లీ వెనక్కి మళ్లుతుంది. బాయిలర్‌లోకి తిరిగి చేరే సమయానికి ఆవిరి ఉష్ణోగ్రత 300 సెంటిగ్రేడ్‌లకు పడిపోతుంది. రీహీటర్ ట్యూబ్స్‌లో మళ్లీ 600 సెంటిగ్రేడ్‌లకు వేడెక్కిన తర్వాత 'ఇంటర్మీడియేటరీ ప్రెషర్ టర్బైన్'లోకి గొట్టాల ద్వారా ఆవిరి ప్రవేశించి దాన్నీ తిప్పుతూ చివరకు 'లో ప్రెషర్ టర్బైన్ 'లోకి చేరుతుంది. అక్కడ చల్లబడిన ఆవిరి మళ్లీ బాయిలర్‌లోకి నీళ్ల రూపంలో ప్రవేశిస్తుంది. మళ్లీ ఆవిరిగా మారి 'హై ప్రెషర్ టర్బైన్'లోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రక్రియ అంతా ఒక లూప్‌గా జరుగుతుంది. నీళ్లు రీసైకిల్ అవుతూ ఉంటాయి.

### నాసిరకం గొట్టాలతో సమస్యే

ఆవిరి టర్బైన్లను తిప్పడం ద్వారా వెలువడే యాంత్రికశక్తిని ఎలక్ట్రిక్ జనరేటర్ విద్యుచ్ఛక్తిగా మార్చుతుంది. ఈ ప్రక్రియలో కీలకమైన 'రీహీటర్ ట్యూబ్స్'లో నాణ్యత లేకుంటే అవి 600 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలతోపాటు తీవ్ర పీడనాన్ని తట్టుకోవడం సాధ్యం కాదు. నాసిరకం ముడిసరుకుతో తయారైన గొట్టాలు తరచూ కోతకు గురికావడం, తుప్పుపట్టడం జరుగుతుందని నిపుణులు అంటున్నారు. దీంతో ఆవిరి ఉష్ణోగ్రతలు పడిపోయి విద్యుదుత్పత్తి నిలిచిపోతుందని చెబుతున్నారు. రీహీటర్ ట్యూబ్స్‌లో వచ్చే సమస్యలతోనే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి అధిక శాతం అంతరాయాలు కలుగుతాయి. దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకున్న గొట్టాలను ఎన్టీపీసీ వినియోగించినా విఫలం కావడంపట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి వెల్డింగ్ చేసి మరమ్మతులు చేసినా భవిష్యత్తులో అవి మళ్లీ విఫలమయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు. రీహీటర్ గొట్టాలకు లీకేజీలతో గత డిసెంబర్‌లో నిర్వహించాల్సిన తొలి యూనిట్ సింక్రనైజేషన్ ప్రక్రియ వాయిదా పడింది.

### నిర్మాణ జాప్యంతో రాష్ట్రంపై భారం

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని తొలి యూనిట్ నుంచి 2020 జూన్‌లో, రెండో యూనిట్ నుంచి 2020 నవంబర్ నాటికి వాణిజ్యపరంగా విద్యుదుత్పత్తి (సీఓడీ) ప్రారంభం కావాల్సి ఉంది. కానీ నిర్మాణంలో జాప్యంతో తొలి యూనిట్ గడువును 2023 మార్చి, రెండో యూనిట్ గడువును 2023 జూలైకు ఎన్టీపీసీ పొడిగించింది. రీహీటర్ ట్యూబ్స్ విఫలం కాకుంటే గత జనవరి నాటికి తొలి యూనిట్, మార్చి నాటికి రెండో యూనిట్ అందుబాటులోకి వచ్చేదని అధికార వర్గాలు తెలిపాయి. వేసవి విద్యుత్ అవసరాల కోసం ప్రస్తుతం రాష్ట్రం ఒక్కో యూనిట్‌ను సగటున రూ.7.20 ధరకు నిత్యం రూ.60 కోట్ల విలువైన విద్యుత్‌ను ఎక్స్ఛేంజీల నుంచి కొంటోంది. ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం సకాలంలో పూర్తై ఉంటే యూనిట్‌కు రూ. 5 ధరతో విద్యుత్ లభించేది. దీంతో అధిక ధర విద్యుత్ కొనుగోళ్ల భారం తప్పేదని, ప్రస్తుత ఫిబ్రవరిలోనే రూ.50 కోట్ల మేర ఆదా అయ్యేవని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

### రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

**మదనాపురం:** రామన్‌పాడు జలశయంలో మంగళవారం పూర్తి నీటిమట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. ఎడమ కాల్వ ద్వారా 950 సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 1,000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కులు నీటిని వినియోగి స్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి పేర్కొన్నారు.

### గోవా మద్యం స్వాధీనం

**కృష్ణా:** మండల సరిహద్దులోని చెక్‌పోస్టులో మంగళవారం ఉదయం గోవా మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా వరంగల్‌కు చెందిన రాజేష్ వాహనంలో 71బాటిళ్ల గోవా మద్యం లభించిందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గోవా నుంచి మద్యం తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ నాగేందర్‌గౌడ్ హెచ్చరించారు.



# సొమ్ము ప్రజలది.. సోకు కేసీఆర్‌ది



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

**జడ్చర్ల/మహబూబ్‌నగర్ న్యూటౌన్:** ప్రజలు పన్నుల రూపంలో ప్రభుత్వానికి సొమ్ము చెల్లిస్తుంటే సీఎం కేసీఆర్ సోకులు పడుతున్నారని బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జడ్చర్ల, మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ప్రజా గోస– బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మేధావులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, పెట్రోల్, డీజిల్ తదితర వాటితో ప్రజలు రూ.45 వేల కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తుంటే సీఎం కేసీఆర్ మాత్రం రైతుబంధు, కల్యాణలక్ష్మి, పింఛన్లు తదితర సంక్షేమ పథకాల పేరిట ఏడాదికి కేవలం రూ.30వేల కోట్లు మాత్రమే అందిస్తున్నారని ఆరోపించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించకుండా అగౌరవపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్నర్ మీటింగ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎవరున్నా అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించే వారన్నారు. సీఎం కేసీఆర్ దళితులు, అణగారిన వర్గాల పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 17 శాతం జనాభా ఉన్న దళితులకు రెండు, మూడు మంత్రి పదవులు రావాల్సి ఉండగా ఎవరికో ఒకటి కేటాయిస్తున్నారని, 0.6 శాతం ఉన్నవారికి మాత్రం నాలుగు మంత్రి పదవులు ఇచ్చారని, అవి కూడా కీలకమైన శాఖలు ఇచ్చారన్నారు. సీఎంఓ కార్యాలయంలో సైతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అధికారుల నియామకాలు చేపట్టడం లేదన్నారు. తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడాలంటే బీజేపీని ఆదరించాలని, ప్రజలకు అన్ని విధాల అండగా ఉంటామని ప్రకటించారు.

**మోసం చేసి బుకాయిస్తున్న పార్టీ బీఆర్‌ఎస్**

ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసి కూడా బుకాయిస్తున్న పార్టీ బీఆర్‌ఎస్ అని ఈటల అన్నారు. ధరణి రూపంలో పచ్చి ఫ్యూడల్ తనాన్ని ప్రదర్శిస్తున్నారని సీఎం కేసీఆర్‌పై మండిపడ్డారు. అసెంబ్లీలో తనను మాట్లాడనివ్వకుండా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై చర్చించే వేదికైన అసెంబ్లీని తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 85 శాతం ఉన్న అణగారిన వర్గాల జాతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించే ఆస్కారం లేకుండా పోతుందన్నారు. దేశంలో బ్యాంకులను ఎగ్గొట్టిన వారిగా 30 లక్షల మంది రైతులకు ముద్ర పడిందని, ఇందుకు ప్రధాన కారణం రూ.లక్ష రుణమాఫీ కాకపోవడమేనన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉందని విమర్శించారు. ఒకసారి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టాక అక్కడి నుంచి ఎలాంటి అదనపు నిధులు రావని తెలిసి కూడా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం తగదన్నారు. సమస్యలపై చర్చిద్దామంటే అసెంబ్లీలో అవకాశం ఇవ్వడం లేదని, అందుకే ప్రజాగోస, బీజేపీ భరోసా ద్వారా ప్రజాక్షేత్రంలో వచ్చామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, హామీల అమలు, నిధుల కేటాయింపు, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై మేధావులు స్పందించకపోతే భవిష్యత్ తరాలకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పొడపాటి చంద్రశేఖర్, నాయకులు అశ్వత్థామరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, నాయకులు ఎన్పీ వెంకటేశ్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు



అమ్మాయిల పరుగు పోటీని పరిశీలిస్తున్న ఐపీఎస్ అధికారిని చేతన

- తుది పరీక్షకు 2,190 మంది అభ్యర్థులు అర్హత

**మహబూబ్‌నగర్ క్రైం:** జిల్లా స్టేడియం గ్రౌండ్‌లో ఈనెల 15నుంచి ప్రారంభమైన దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం ముగిశాయి. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన కానిస్టేబుల్, ఎస్‌ఐ అభ్యర్థులకు ఈ దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. చివరిరోజు మహిళ, పురుషులు కలిపి 1,322 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 1,173 మంది హాజరు కాగా 466 మంది అభ్యర్థులు తుది పరీక్షకు అర్హతకు సాధించారు. వారం రోజుల పాటు జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 6,285 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 5,542 మంది హాజరు కాగా 743 గైర్హాజరయ్యారు. ఇందులో 2,190 మంది అభ్యర్థులు తుది పరీక్షకు అర్హత సాధించారు. 3,352 మంది అభ్యర్థులు ఇంటి ముఖం పట్టారు. అర్హత సాధించని వారిలో 1,989 మంది అభ్యర్థులు 1600 మీటర్ల పరుగులోనే వెనుదిరిగారు.చివరి రోజు దేహదారుఢ్య పరీక్షలను ఐపీఎస్ అధికారిని డాక్టర్ చేతన, ఎస్పీ కె.నరసింహ, నోడల్ ఆఫీసర్ రాములు పర్యవేక్షించారు.

# అటవీ బేస్ క్యాంపుల పరిశీలన



కోతిగుండు వద్ద అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

**కొల్లాపూర్ రూరల్:** ఫారెస్టు రేంజ్ పరిధిలో ఉన్న మొలచింతలపల్లి, పెద్దూటి బేస్ క్యాంపులను మంగళవారం అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ క్షితిజ, డీఎఫ్ఓ రోహిత్ గోపిడి, నవీన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పెద్దూటిలోని సోలార్ బోర్‌వెల్‌ను, కోతిగుండు ఏరియాలో జరుగుతున్న అభివృద్ధి పనులను, అనంతరం సోమశిల సమీపంలో ఉన్న అర్బన్ పార్క్‌ను పరిశీలించారు. ఆయాచోట్ల పనులు జరుగుతున్న విధానాన్ని స్థానిక అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక అధికారులతో వారు వైల్డ్‌లైఫ్, వాటరింగ్ ఫైర్ మేనేజ్‌మెంట్లపై సమీక్షించారు.

# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**నారాయణపేట రూరల్:** కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బండగొండలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి వెంకటయ్య(35), నిర్మల దంపతులు గ్రామ శివారులో దాబా హోటల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటయ్య మంగళవారం సాయంత్రం మద్దూరు మండలం భూనీడ్ సమీపంలో పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు. వెంకటయ్యకు భార్యతోపాటు ఇద్దరు సంతానం ఉన్నారు.

# ఆందోళనలో ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు



జూలెకల్ సమీపంలోని ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో నిలిచిన నీటి ప్రవాహం

- నిలిచిన ఆర్డీఎస్ కెనాల్ నీటి ప్రవాహం
- పంట నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన

**శాంతినగర్:** వడ్డేపల్లి మండలంలో ప్రవహించే ఆర్డీఎస్ కెనాల్‌కు నీళ్లు ఎప్పుడు వస్తాయోనని ఆయకట్టు రైతులు ఎదురు చూస్తున్నారు. ఆర్డీఎస్ కెనాల్‌లో మూడు రోజులుగా నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో డిస్ట్రిబ్యూటరీలు, సబ్ డిస్ట్రిబ్యూటరీలు నీటి ప్రవాహం లేక వట్టిపోయాయి. ఆయకట్టు కింద సాగుచేసిన మొక్కజొన్న, వరి, సీడ్ జొన్న, మినుములు, కూరగాయల పంటలు వాడుబట్టాయి. పంటలు చివరి దశకు చేరిన సమయంలో నీటి తడులు ఇవ్వకపోతే తాలు గింజలే మిగులుతాయని రైతులు వాపోతున్నారు. లక్షల్లో పెట్టిన పెట్టుబడులు తిరిగిరావని, అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు. ఈ విషయమై ఆర్డీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే తుమ్మిళ్ల లిఫ్ట్ ఆన్‌చేసి సాగునీరు అందించాలని కోరుతున్నారు. ఈవిషయమై నీటి పారుదలశాఖ ఏఈ శ్రీనివాసులును వివరణ కోరగా మంగళవారం 0.8 టీఎంసీలకు ఇండెంట్ పెట్టామన్నారు. రోజుకు 2వేల క్యూసెక్కుల ప్రకారం నాలుగు రోజులపాటు తుంగభద్ర డ్యాం నుంచి నీటిని విడుదల చేస్తారన్నారు. అంతేగాక కేసీ కెనాల్ అధికారులు రోజుకు 2,500 క్యూసెక్కుల చొప్పున ఇండెంట్ పెట్టారని, శుక్రవారం వరకు తుమ్మిళ్ల వద్దకు నీరు చేరే అవకాశం ఉందని, వెంటనే తుమ్మిళ్ల మోటార్ ఆన్‌చేసి ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తామని ఏఈ పేర్కొన్నారు.

### నీటి విడుదలపై ఆందోళన వద్దు..

**రాజోళి:** ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు తుమ్మిళ్ల లిఫ్టు నీటి విడుదలపై ఆందోళన చెందవద్దని ఈఈ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల నుంచి నీటి విడుదల నిలిచిన కారణంగా రైతులు ఆందోళన పడుతున్నారని, పంటలకు తడులను అందించేందుకు రాష్ట్ర స్థాయిలో అధికారులు, మంత్రులతో మాట్లాడి నీటి విడుదల చేస్తామని పేర్కొన్నారు. తుంగభద్ర నదిలో నుంచి ఏపీ వాళ్లు నీటిని వాడుకుంటున్న క్రమంలో స్థానిక ఎమ్మెల్యే అబ్రహం ఏపీ అధికారులతో మాట్లాడారని, వారు కూడా సానుకూలంగా స్పందించి కేసీ కెనాల్‌కు నీరు మళ్లించే వద్ద తమ లెవెల్‌ను తగ్గించుకుంటామని తెలిపినట్లు వెల్లడించారు. రాష్ట్రానికి రావాల్సిన 1,500 క్యూసెక్కుల ఇండెంట్, ఏపీకి రావాల్సిన 2వేల క్యూసెక్కుల ఇండెంట్ ఎగువ నుంచి రావాల్సి ఉందని, ఈ క్రమంలో ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద నీటి స్థాయి కూడా పెరుగుతుందన్నారు. టీబీ డ్యాం నుంచి నీరు వస్తుందని, శుక్రవారం తుమ్మిళ్ల మోటార్ రన్ చేస్తామని తెలిపారు.